అనుదినం జనపక్షం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

ఆదివారం 19 ఫిబ్రవరి 2023

పాటల సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్



మెస్రం పురుషోత్తం రచించిన సేవాలాల్ మహారాజ్ పాటల సీడీని శనివారం కొత్తపెల్లిలో ఆవిష్కరించారు. దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ చేతుల మీదుగా సీడీని విడుదల చేశారు. కార్యక్రమంలో లంబాడి లైవ్ జిల్లా అధ్యక్షుడు వసంత్ జాదవ్, నాయకులు గణపతి, శివాజీ, విలాస్‌రావ్ పటేల్, గాయకుడు మెస్రం పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఎద్దు మతి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన రైతు భీంరావుకు చెందిన ఎద్దు శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే పొలానికి రెండు ఎడ్లను మేత కొరకు తీసుకెళ్లాడు. అక్కడి నుండి ఎడ్లను నీళ్ల తాగించడానికి తీసుకెళ్లిన క్రమంలో పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓ ఎద్దు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.60వేలు ఉంటుంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, గతంలోనూ ఎన్నో జరిగాయని రైతులు పేర్కొంటున్నారు.



గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్

గురుకుల కళాశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ కె.వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెఈఈ అడ్వాన్స్ స్టడీ మెటీరియల్ అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకుల కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో 40 మంది అర్హత సాధించడం అభినందనీయమని కొనియాడారు. అందుకు ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందించారు. గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువులకు ఐటీడీఏ ద్వారా పూర్తి ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఓ గంగాధర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. శ్రీనివాసులు, స్టార్-50 సమన్వయకర్త మారుతీశర్మ, ప్రిన్సిపాల్‌లు సురేష్, సునయిన, విద్యార్థులు పాల్గొన్నారు.

నిఘా నీడలో జాతర బందోబస్తు

- సీసీ కెమెరాలతో ఏర్పాట్లు పర్యవేక్షించిన డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్

నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి ఆదేశాల మేరకు వేలాల జాతరలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. శనివారం ఉదయం ప్రారంభమైన జాతరలో సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా రద్దీ ప్రదేశాలు, బందోబస్తు ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్ పర్యవేక్షించారు. జైపూర్ ఏసీపీ నరేందర్‌తో కలిసి గుట్టపై ఉన్న గట్టు మల్లన్న ఆలయంతో పాటు వేలాల గ్రామంలో గల మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రధానంగా పార్కింగ్ ఏరియా, గోదావరి స్నాన ఘట్టాలు, రద్దీ ప్రదేశాలను గుర్తించి అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ రాజుతో పాటు స్థానిక ఎస్సై రామకృష్ణను ఆదేశించారు.

నేడు జెండావిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మదినం పురస్కరించుకొని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్‌లోని శివాజీ చౌక్‌లో జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు భజరంగ్‌దళ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ మాధవరం రంగస్వామి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

గిరి పల్లెలో.. 'సాహస' కుర్రోడు..!

- రాఫెల్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న శ్రీనివాస్
- వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే ఆర్థిక స్థోమత అడ్డంకి
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే రాణిస్తానంటున్న యువకుడు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అదో మారుమూల ఆదివాసీ పల్లె. ఆ ఊరికి కనీసం బీటీ రోడ్డు సౌకర్యం కూడా లేదు. కొండలు..గుట్టలకు ఆనుకొని ఉన్న ఈ పల్లెలో ఓ సాహస కుర్రోడు వెలుగులోకి వచ్చాడు. ఎక్కువ మందికి సాధ్యం కాని రాఫెల్లింగ్ క్రీడలో రాటుదేలాడు. చిన్ననాటి నుంచి సహజంగానే కొండలు ఎక్కి దిగే ఈ కుర్రాడు దీనినే సాహస క్రీడకు అన్వయించుకున్నాడు. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తున్నాడు ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పీచర గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్. ఇచ్చోడలోని ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన ఈ కుర్రాడు ఈ పోటీల్లో పాల్గొంటూనే పొలం పనులకు వెళ్తున్నాడు. చిన్ననాటి నుంచే కొండలు గుట్టలు ఎక్కిన అలవాటుతో దగ్గరి సంబంధం కలిగిన వాటర్ రాఫెల్లింగ్ క్రీడ పట్ల మక్కువ పెంచుకొని ఇందులో రాణించాలనే తపనతో ఉన్నాడు.



కొండలు దిగిన అలవాటుతో..!

సహజంగానే ఆ ప్రాంతంలో ఉండే కొండలు ఎక్కి దిగడం అలవాటుగా మార్చుకున్న ఈ కుర్రాడు జలపాతాల వద్ద నిర్వహించే రాఫెల్లింగ్ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. తొలుత లింగాపూర్ మండలం మిట్ట జలపాతం ఎక్కి..దిగడం నేర్చుకున్నాడు. అక్కడ నిర్వహించిన కళ్లగంతలు కట్టి కిందకు దిగడం(వాటర్ రాఫెల్లింగ్)పోటీల్లో పాల్గొని బహుమతి సాధించాడు. అక్కడ్నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఎక్కడ పోటీలు జరిగినా అక్కడికి వెళ్లి పాల్గొనడం.. అక్కడ ఏదో ఒక బహుమతి సాధించడం అలవాటుగా మార్చుకున్నాడు. అక్వ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాదులో ఈ క్రీడపై కొన్ని రోజుల పాటు మరిన్ని మెళుకువలు తెలుసుకున్నాడు. ఇటీవల ఇచ్చోడ మండలం గాయత్రి జలపాతం వద్ద నిర్వహించిన రాఫెల్లింగ్ ప్రపంచ కప్ పోటీల్లోనూ పాల్గొన్నాడు. సుమారు 18 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లోనూ పాల్గొని వాటర్ రాఫెల్లింగ్ విభాగంలో మూడో బహుమతి సాధించాడు. వైజాగ్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లోనూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ఒక్క యువకుడే పాల్గొనడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో ఎక్కడ పోటీలు జరిగినా ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి తన ప్రతిభను చాటుతున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

ఆదివాసీల్లో నాయక్‌పోడ్ తెగకు చెందిన ఈ యువకుడి కుటుంబం పేదరికం కావడంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. తండ్రి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండటం.. దీని మీద వచ్చే ఆదాయంతోనే వారి కుటుంబ పోషణ కొనసాగుతోంది. ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో దేశంలో వివిధ చోట్ల జరిగే పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాలంటే సొంత డబ్బులు ఖర్చు చేసి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అక్వా ఫౌండేషన్ ద్వారా వెళ్తున్నా.. ప్రయాణ ఖర్చులు మాత్రం ఈ యువకుడే భరించాల్సి ఉంటుంది. ఈ ఆటలో వివిధ పురస్కారాలు అందుకుంటున్నా.. పేదరికం వెంటాడటంతో ఈయన ప్రతిభకు ఆర్థిక స్థోమత అడ్డంకిగా మారుతోంది. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే ఈ ఆటలో మరింత రాణిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారు సత్కారాలు అందుకుంటున్నా..ప్రభుత్వ ప్రోత్సాహం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరెస్టును అధిరోహించాలని కోరిక : పెరుమాండ్ల శ్రీనివాస్, రాఫెల్లింగ్ క్రీడాకారుడు



గిరిజనుల్లోనే ఇతర తెగలకు చెందిన ఇద్దరు ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కారు. మా తెగ నుంచి కూడా ఆ శిఖరాన్ని అధిరోహించాలని బలమైన కోరిక ఉంది. ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తే ఆ శిఖరాన్ని ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నాను.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



జైపూర్ : వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గొద్దని, ప్రధానంగా తాగు నీటి వసతి, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ నాయక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్‌తో కలిసి శనివారం వేలాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఆయన ప్రధానంగా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేలాల జాతర సందర్భంగా ప్రభుత్వ పరంగా చేపట్టిన పనులను అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా పర్వత ప్రాంతంలో వెలిసిన గట్టుమల్లన్న, వేలాల గ్రామంలో వెలిసిన మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్ స్థానిక నాయకులతో కలిసి కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను సన్మానించారు.

విద్యుత్ ఉద్యోగుల పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జయకేతనం



కాగజ్‌నగర్ : ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్ విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. హైద్రాబాద్‌లోని విజయానంద్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఇంటర్ సర్కిల్ రాష్ట్ర స్థాయి 20-20 క్రికెట్ పోటీలలో ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. టాస్ గెలిచిన మహబూబ్‌నగర్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 136 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు 19.3 ఓవర్లలో 137 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం జట్లు పాల్గొన్నాయి. మొదటి సారి విజయం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టును ఆసిఫాబాద్ ఎస్ఈ వాసుదేవ్, ఆదిలాబాద్ ఎస్ఈ సంపత్‌కుమార్, నిర్మల్ ఎస్ఈ చౌహాన్, మంచిర్యాల ఎస్ఈ శేషారావు, కాగజ్‌నగర్ డీఈ రాజశేఖర్ అభినందించారు.

బాబోయ్ దొంగలు..!

- తాళం వేసిన ఇండ్లే టార్గెట్‌గా దోపిడీ
- తాజాగా తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు కన్నం
- ఖాకీలకు సవాల్‌గా మారుతున్న వరుస ఘటనలు

జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాళం వేసి ఇళ్లే టార్గెట్‌గా దోపిడీలకు పాల్పడుతున్నారు. కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు రుగుతుండటంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. రోజుల వ్యవధిలోనే కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి)ల్లో దొంగతనాలు జరగడంతో కలవరపాటుకు గురవుతున్నారు. ఎవరి ఇంటిని గుల్ల చేస్తారోనని భయపడుతున్నారు. జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. దొంగలను గుర్తించి పట్టుకునేందుకు వివిధ రకాలుగా పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

నవతెలంగాణ - చింతలమానేపల్లి

జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోజుల వ్యవధిలోనే వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల రవీంద్రనగర్-1 తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బిల్డింగ్ గోడకు కన్నం వేసి, సీసీ కెమెరాలను పగలగొట్టడం సంచలనంగా మారింది. మరోపక్క శుభకార్యాల సీజన్ కావడంతో అనేక మంది ఇండ్లకు తాళాలు వేసి వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు తాళం వేసి ఇండ్లనే టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఇంటి యజమానులు వచ్చేలోపు నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, సిర్పూర్-టి, పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయి. నేరాల నియంత్రణకు కొన్ని మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నా వరుస చోరీలకు అడ్డుకట్ట పడటం లేదు. రాత్రి వేళల్లోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండ్లలో పాటు ఆలయాల్లోనూ వరుసగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

బెంబేలెత్తిపోతున్న జనాలు..!

ఈ ఏడాది ప్రారంభంలో ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడిన దుండగులు ప్రస్తుతం ఇండ్లపై కన్నేశారు. జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉండటం.. కాగజ్‌నగర్, రెబ్బెనలో రైల్వే మార్గాలు ఉండటంతో పొరుగు రాష్ట్రం నుంచి ఇటువైపు వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన వారే ఇండ్లలోనూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్-1లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. అర్ధరాత్రి బ్యాంక్ బిల్డింగ్ వెనుక ఉన్న గోడకు రంధ్రం చేసి లోపలికి చొరబడ్డారు. ఆ తర్వాత బ్యాంక్‌లో డబ్బులు, బంగారం నిల్వ ఉంచే స్ట్రాంగ్ రూమ్‌ను గ్యాస్ కట్టర్లతో కట్ చేసేందుకు యత్నించారు. అయితే అది పూర్తిగా కట్ కాకపోవడంతో దొంగల ప్రయత్నం విఫలమైంది. ఈ క్రమంలో దొంగలు బ్యాంక్‌లోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్, బ్యాంక్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఎత్తుకెళ్లారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 87 చోరీలు జరగగా రూ.75.39 లక్షల నగదు చోరీకి గురైంది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 54 కేసులను పోలీసులు ఛేదించి రూ.22.60 లక్షలను రికవరీ చేశారు.పెద్ద ఎత్తున నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి.



చోరీ జరిగిన టీజీబీని పరిశీలిస్తున్న ఎస్పీ

వరుస ఘటనలివి..!

పగటిపూట దొంగలు రెక్కీ నిర్వహించి, తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది. కిందటి నెల 7వ తేదీన కౌటాల సాయిబాబా ఆలయంలో తాళాలు పగలగొట్టి కిరీటాన్ని దొంగిలించారు. కౌటాలలోని సదాశివపేట శివాలయంలో అమ్మ వారి బంగారం, నాణేలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఏడాది జనవరి 20న సిర్పూర్ (టి) మండలం ని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో హుండీ పగల గొట్టి రూ.20 వేల వరకు నగదును దొంగలించి వెళ్లారు.జనవరి 27న కాగజ్ నగర్ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగింది. అక్కడ కూడా హుండి పగలగొట్టి రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు చౌక్ వద్దనిలిపి ఉంచిన రమేశ్ అనే వ్యక్తి బైక్‌ను ఈ నెల 12న గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గత సంవత్సరం మే 13న కౌటాల మండల కేంద్రంలో ప్రగతి కాలనీకి చెందిన రత్నం శివరాం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాదుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. రజనీ అనే మహిళ ఇంట్లోనూ బంగారం, నగదు ఎత్తికెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కేవలం ఏడాది వ్యవధిలోనే జిల్లాలో అనేక చోరీ ఘటనలు జరగడంతో జిల్లావాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



అడ్డుకట్ట వేస్తాం : ఎస్ఐ విజయ్



వరుస చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట పెట్రోలింగ్ పెంచుతున్నాం. దొంగత నాలపై ప్రత్యేక టీం విచారణ కొనసాగిస్తోంది. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఇది వరకే అనేక చోరీ కేసులను ఛేదించాం.

గోదావరికి పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-నస్పూర్



మహాశివరాత్రి సందర్భంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గోదావరికి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా డీఎంఎఫ్టీ నిధులతో పుష్కర ఘాట్, కరెంట్ పోల్స్, లైటింగ్, రోడ్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు దంపతులు స్నానం ఆచరించి గంగాభవాని శంకర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మహాశివరాత్రి చాలా ప్రాముఖ్యమైనదని, దాదాపు 140 సంవత్సరాల తర్వాత వచ్చిందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పుష్కర ఘాట్ వద్ద స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశామని, టాయిలెట్స్, డ్రెస్సింగ్ రూమ్స్, రోడ్ల వెడల్పు, లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం భక్తుల కోసం నడిపెల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు విజిత్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, 22వ వార్డు కౌన్సిలర్ వంగ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రఘుపతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాంపల్లి గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులకు కొక్కిరాల రఘుపతిరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు- సురేఖ భక్తులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్లు సుమతి- మల్లేష్, బొద్దున సంధ్యారాణి-రామ్మూర్తి, గెల్లు రజిత- మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ధారవేణి తిరుపతి, జిల్లా యూత్ అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి, పట్టణ యువత అధ్యక్షుడు నరిగె నరేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకూ తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

సీతారాంపల్లి గోదావరి పుష్కర ఘాట్ వద్ద స్నానాలు ఆచరించడానికి వెళ్తున్న భక్తులకు వాహనాల రద్దీ పెరగడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు గోదావరి స్నానానికి రావడంతో ట్రాఫిక్‌లో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా ఇబ్బందులు తప్పలేదు.

బాసర : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం బాసర గోదావరి తీరం భక్తజనసంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాల నుండే కాక మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులతో గోదారి తీరం శివ నామస్మరణతో మారుమోగింది. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి నది తీరాన గల సూర్యేశ్వర ఆలయంలో అభిషేక అర్చన హారతి పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అన్నదాన సత్రంలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

నిర్మల్ : భక్తి శ్రద్ధలతో శివరాత్రి పర్వదినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలో నిర్వహించారు. బ్రహ్మపురి, వెంకటాద్రిపేట్ ఓంకారేశ్వర ఆలయం, దివ్యానగర్‌లోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్రం, బంగల్‌పేట్ రాజశ్యామల ఆలయం, చిట్యాల్, కడ్తల్, ముజ్గి, నీలాయ్‌పేట్‌తో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. భక్తులకు రాత్రి జాగారానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అభిషేకాలు, భజనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉపవాస దీక్షలు విడవడానికి అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

ఉట్నూర్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని సాలేవాడ గ్రామంలోని శివాలయంలో జెడ్పి చైర్మన్ జనార్ధన్, మాజీ ఎంపీ గోడం నగేష్, ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, ఎస్ఐ భరత్ సుమన్ దంపతులు, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, పట్టణ ప్రముఖులు, నాయకులు, ప్రజలు పాల్గొని శివునికి పూజలు చేశారు. పాత ఉట్నూర్‌లోని రామాలయం భక్తులతో కిటకిటలాడింది.

కుభీర్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పార్డి(బి)చ పాంగర్‌పాడ్, పల్సి, కుభీర్ తదితర గ్రామాల్లోని శివాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లక్ష్మణచాంద : మండలంలోని బాబాపూర్ శ్రీరాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సిఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.



బాసరలో..



లక్ష్మణచాందలో..

భక్తులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



మహాశివరాత్రి పురస్కరించుకుని రామకష్ణాపూర్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల గోదావరి నదిలో స్నానాలు ఆచరించడానికి విచ్చేసిన భక్తులకు నది ప్రాంగణంలో అల్పాహారం అందజేశారు. అల్పాహారాన్ని దాతలు ఆడెపు రాధ వెంకటనర్సయ్య, అడెపు స్వప్నకృష్ణ కుమార్ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అడేపు తిరుపతి, స్టీరింగ్ కమిటీ సభ్యులు బొద్దుల మల్లేశ్, బూర సారంగపాణి, సంఘం సభ్యులు ఆడేపు కృష్ణకుమార్, వాడ్నాల, శ్రీనివాస్, గాజంగి సంతోష్ పాల్గొన్నారు.

బట్టలు పంపిణీ చేసిన జడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు



రుయ్యాడి గ్రామంలో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయంలో జెడ్పిటిసి గణేష్‌రెడ్డి శనివారం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. మహా శివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కళ్యాణం, అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరంతో పాటు ఈ సంవత్సరం కూడా 200 మంది బీదవారికి వస్త్ర దానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాజేశ్వర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, వెంకన్న యాదవ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు రఫీక్, గంగన్న, ప్రకాష్‌రావు, ప్రకాష్‌రెడ్డి, నిట్యాడి గంగాధర్, గంగన్న, వెంకటేష్ యాదవ్, రాకేష్, మఠం వెంకట్‌రెడ్డి, మోతే శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-దండేపల్లి

నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ సారథ్యంలో అద్భుతమైన పథకాలు అమలు చేస్తున్నారని, దళితబంధు వంటి వాటితో టీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగిందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు టిఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పార్టీగా, అధికార పార్టీగా ఎంతో అభివృద్ధి సాగిస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు టీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. టీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యాన్ని కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ పథకాలు, సంక్షేమం చూసి తట్టుకోలేక అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని, మోసపూరిత నాయకుల మాటలు వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని వివరించారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషి చేసి గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్‌లో గ్రామాన్ని మరింత ముందుకు తీసుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, స్థానిక నాయకులు, ఆయ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త నుంచి ఆదాయం ఉత్తదేనా..?

- జిల్లాలో వృథాగా శెగ్రిగేషన్ షెడ్లు
- లక్షల నిధులతో నిర్మించినా నిరుపయోగం



నవతెలంగాణ-నిర్మల్

గ్రామాల్లో పారిశుధ్య సమస్యను తీర్చడంతో పాటు సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేసి కంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో శెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి పూనుకుంది. జిల్లాలో దాదాపు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. అయితే పనులు పూర్తయినా ఆదాయం సమకూరడం లేదు. సేకరించిన చెత్తను షెడ్ల సమీపంలోనే కుప్పలుగా పోయడం, కొన్ని చోట్ల చెత్తను వృథాగా తగలబెడుతున్నారు. దీంతో లక్షల రూపాయలు కేటాయించి నిర్మించిన శెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో చెత్త నుంచి ఆదాయం పొందాలనే లక్ష్యం ఉత్తదిగానే మిగిలింది. నిర్మల్ జిల్లాలో 19 మండలాలకు 396 గ్రామ పంచాయతీలున్నాయి. ఈజీఎస్ నుంచి 393 శెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం సుమారు రూ.9.84కోట్లు కేటాయించారు. ఒక్కో శెగ్రిగేషన్ షెడ్ నిర్మాణానికి రూ.2.5లక్షలు ఖర్చు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికిగాను రూ.8.46 కోట్ల నిధులు వెచ్చించారు. అయితే ఈ నిర్మాణాలు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా నిర్దేశించిన లక్ష్యం సాధించేందుకు మాత్రం ఎలాంటి ముందడుగు పడడం లేదు. గ్రామాల్లో ప్రతి రోజు సేకరిస్తున్న చెత్తను కొన్ని చోట్ల ఈ శెగ్రిగేషన్ షెడ్ల సమీపంలో పారబోస్తున్నారు. తడి, పొడి, ఇతరత్రా వ్యర్థాలను వేరు చేయకపోవడంతో ఈ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో సమీప ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక కొన్ని ప్రాంతాల్లో చెత్తను తగలబెడుతున్నారు. దీంతో సంపదను తయారు చేసే ఈ శెగ్రిగేషన్ షెడ్లు వృథాగానే మిగిలిపోతున్నాయి.

లక్షలు వెచ్చించినా నిరుపయోగం

జిల్లాలో లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన శెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత ఎక్కువగా ఉండడం, ఉన్న వారిపై పని భారం పడడం లాంటివి జరుగుతున్నాయి. కార్మికులకు సేంద్రీయ ఎరువుల తయారీ, చెత్తను వేరుగా చేయడం లాంటి విషయాలపై అవగాహన లేకపోవడం, సంపదను తయారు చేయడంలో అధికారులు శిక్షణ ఇవ్వకపోవడం కూడా దీనికి కారణాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన ఈ శెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చి చెత్త నుంచి సంపద తయారు చేసి పంచాయతీలకు ఇకనైనా ఆదాయం సమకూరిస్తే ప్రయోజనం చేకూరనుంది.

ప్రత్యేకంగా దృష్టి సారిస్తే ప్రయోజనం

గతంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ శెగ్రిగేషన్ షెడ్ల వినియోగంపై, వీటివల్ల సేంద్రియ ఎరువుల తయారీపై పలు మార్లు సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుత కలెక్టర్ వరుణ్‌రెడ్డి సైతం గ్రామీణాభివృద్ధి పనుల్లో భాగంగా వీటిపై దిశా నిర్దేశం చేశారు. అయినప్పటికీ ఆ దిశగా కార్యాచరణ కనబడటం లేదు. చెత్త నుండి సంపదను సృష్టించేలా ప్రత్యేకంగా దృష్టి సారిస్తే తప్ప ప్రయోజనం చేకూరేలా లేదు.

గిరిజన విద్యార్థుల అభివృద్ధికి అన్ని చర్యలు

- ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి
- జేఈఈ విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిడిఏ పిఓ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పిటిజి గురుకులంలో చదువుతూ జేఈఈ పరీక్షలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విగ్నేష్, తరుణ్‌ను ఉట్నూర్ ఐటీడీఏ పీవో కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల వికాసానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడు నెలల నుండి గిరిజన విద్యార్థులకు జేఈఈ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా ఇదే తీరుగా ప్రతిభ కనబరచాలని సూచించారు. అవసరమైన కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించండి. అనంతరం విద్యార్థులకు జేఈఈ అడ్వాన్స్ మెటీరియల్ అందజేశారు. విద్యార్థుల ప్రతిభకు కారణమైన ఆర్‌సిఓ గంగాధర్, కోఆర్డినేటర్లు మారుతీశర్మ, శ్రీనివాసస్వామి, ప్రిన్సిపాల్ సురేష్, కళాశాల కోఆర్డినేటర్ డివిఎస్ మూర్తిను కూడా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన భక్త జనం

- మల్లన్న నామస్మరణతో మారుమోగిన పర్వత గిరి



జైపూర్‌లో...

నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాల గట్టు మల్లన్న దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. పిలిచిన పలికే దేవునిగా ప్రసిద్ధిగాంచిన గట్టు మల్లన్న నామ స్మరణతో పర్వత గిరి మారుమోగింది. శనివారం ఉదయం నుండి మొదలైన భక్తుల రాకపోక రాత్రి వరకు కొనసాగింది. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో గట్టు మల్లన్న నిలయమైన పర్వత ప్రాంతం దద్దరిల్లింది. చెట్టు పుట్ట తేడా లేకుండా ఎక్కడ చూసినా జన సందోహం కన్పించింది. మల్లన్న దర్శనార్థం తరలివచ్చిన భక్తులు ముందుగా సమీపంలోని గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తారు. అనంతరం గట్టు మల్లన్న సన్నిధికి చేరుకుని ఉపవాస దీక్షతో జాగరణలో పాల్గొంటారు. ప్రాథకాల వేల జరిపే నిశీ పూజ, అర్ధ రాత్రి లింగోద్భవ కాలాన స్వామివారికి సమర్పించు సామూహిక బిల్వ దళ సమర్పణలో పాల్గొనడం భక్తులు ఆనవాయితీగా పాటిస్తారు. చుట్టూ గుట్టల సమూహం పశ్చిమ ముఖ:ద్వారంతో గుట్టదొనలో స్వయంభూ లింగాకారుడై వెలిసిన గట్టు మల్లన్న లింగాకారుడై దర్శనమిస్తున్నాడు. మహా శివరాత్రి పర్వదినాన దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కొత్త కుండల్లో బోనాలు పోసి మల్లన్నకు నైవేద్యంగా సమర్పించి ఉపవాస దీక్షను విరమించడం భక్తులు ఆనవాయితీగా పాటిస్తారు.

కన్నుల పండువగా భ్రమరాంభిక మల్లికార్జునస్వామి కళ్యాణం

వేలాల మల్లికార్జునస్వామి మహాశిరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి భ్రమరాంభా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణోత్సవాన్ని జరిపించగా భక్తులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దీనికి ముందు యాదవులు తమ కులదైవమైన మల్లికార్జునస్వామిని సాంప్రదాయ పద్ధతుల్లో గోదావరి నదికి పుణ్యస్నానాల కోసం తరలించారు. అదేవిధంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాల మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ రమేశ్ తెలిపారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రత్యేక పూజలు

మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఉదయం వేలాల గట్టు మల్లన్నను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సతీమణి రాణి అలేఖ్య తను కూమారునితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రంథాలయ చైర్మెన్ రేణుగుంట ప్రవీణ్ కుమార్ దంపతులు గట్టు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్‌తో కలిసి జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి స్థానిక నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆలయాల్లో జాతర సంబరాలను ఘనంగా నిర్వహించారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో శైలక్షేత్రాలన్నీ మార్మోగాయి. మండలంలోని కదిలి పాపహరేశ్వరాలయం, కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలలో ఏఐసీసీ కార్యక్రమాల చైర్మెన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దంపతులు, డిసిసి అధ్యక్షులు ముత్యంరెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ విరేష్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిలావర్‌పూర్ ఏకనాథ్ ఆలయం, కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయాలతోపాటు నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్నిలో గల చక్రలింగేశ్వర స్వామి ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చారణతో ఘనంగా పూజలు జరుగుతున్నాయి. కదిలి పాపా హరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి భుజంగరావు, కాలువ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మల చిన్నయ్య భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రెబ్బెన : మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నంబాల జాతరలో పరిసర ప్రాంత భక్తులు శివుడిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ బొర్కుటె హేమంత్ వాసుదేవ్‌రావు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ప్రజా ప్రతినిధులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుమారు 6 గంటలకు స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.

ఆదిలాబాద్ అర్బన్ : జిల్లాలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలను భక్తి శ్రద్ధల నడుమ జరుపుకున్నారు. శనివారం పట్టణంలోని ప్రముఖ శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. భక్తులు ఉదయం నుంచే దర్శనానికి క్యు కట్టారు. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి స్థానిక వినాయక్ చౌక్ వరకు మహాకాల్ సేన అధ్వర్యంలో పరమశివుడి భారీ విగ్రహాన్ని వాహనంలో ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జోగురామన్న హాజరై ర్యాలీని ప్రారంభించారు. ముందుగా శివలింగంతో పాటు మహా శివుడి విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డోల్ బృందం ర్యాలికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీజే చప్పుల్ల నడుమ యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఏటా ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ పవన్ నాయక్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మహాకాల్ సొసైటీ అధ్యక్షులు అజయ్, నాయకులు రాజేశ్వర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

తాంసి : శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రోజున వాడ్డాడి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ మాజీ ఎంపీ గొడం నగేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు బండల్ నాగపూర్, పోన్నరి,కరంజి, నిపానీ గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో శివపార్వతుల కళ్యాణం ఎంతో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి కళ్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, స్వప్న రత్న ప్రకాష్, జడ్పీటీసీ రాజుచ పార్టీ కన్వీనర్ అరుణ్ కుమార్, నాయకులు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌అర్బన్‌లో...

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

- స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో భాగ్యోదయం సామూహిక పఠనం



నవతెలంగాణ-మంచిర్యాల

దళితులపై జరుగుతున్న దురన్యాయాలకు వ్యతిరేకంగా 80 సంవత్సరాల క్రితమే ఉద్యమించిన తొలితరం దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జీవితాన్ని నేటితరం ఆదర్శంగా స్వీకరించాలని వక్తలు పేర్కొన్నారు. స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహం దగ్గర భాగ్యోదయం పాఠ్యాంశాన్ని సామూహికంగా బోధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుని నీలాదేవి పాఠ్యాంశాన్ని విద్యార్థులకు, సభికులకు బోధించారు నాటి హైదరాబాద్ సంస్థానంలో దళితుల అభ్యున్నతికి ఒంటరి పోరాటం చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మని నేటితరం అందరూ గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. నేటి కాలంలో మనువాదం విజృంభిస్తున్న తరుణంలో బహుజన, ప్రజాస్వామిక శక్తులు ఐక్య పోరాటం చేసి అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ అందె మంగ, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బహుజన ఐక్యవేదిక కన్వీనర్ పలిగిరి కనకరాజు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు సంకె రవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు కిష్టయ్య, ప్రజాస్వామ్య ఉపాధ్యాయ సంఘం నాయకులు జయకృష్ణ, బహుజన ఐక్యవేదిక నాయకులు దేవి పొచ్చన్న, శ్రీమన్నారాయణ బీసీ వేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య పత్తి సత్తయ్య, ఏల్పుల నరేష్ బహుజన ఉద్యమ కార్యకర్తలు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ పండితులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-మంచిర్యాల

నల్లగొండ, సంగారెడ్డి విద్యాధికారులు భాషా పండితులపై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రాల రాజావేణు, గొల్ల రామన్న తెలిపారు. సంవత్సరాల తరబడి ప్రమోషన్ లేకపోయినా, అలవెన్సులు ఇవ్వకపోయినా, జీతం పెరగకపోయినా హయ్యర్ క్లాసెస్ బోధిస్తున్న భాషా పండితులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. జాబ్ చార్టులో లేని పనులు చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి విద్యాబుద్ధులు నేర్పాలని తపనతో మాత్రమే ఈ పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో తమ పదోన్నతుల అంశం లేకపోవడంతో ఆవేదనకు గురైన భాషా పండితులు జాబ్ చార్ట్‌లో లేని హైయర్ క్లాస్ బోధన చేయబోమని నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై వారిపై వేసిన సస్పెన్షన్ వేటు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

గోదావరి నదిలో పడి యువకుడి మృతి



నవతెలంగాణ-బాసర

పుణ్య స్నానలకు వచ్చి గోదావరి నదిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం బాసరలో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా అంఝే గ్రామానికి చెందిన ప్రదీప్(25) స్నేహితుతో కలిసి మహా శివరాత్రి పండుగ సందర్భంగా బాసర క్షేత్రానికి వచ్చారు. ముందుగా గోదావరి మొదటి ఘాట్ నది తీరంలో స్నానం ఆచరించడానికి వెళ్లిన ప్రదీప్ ప్రమాధవశాత్తు నీటిలో మునిగి పోయాడు. స్థానిక మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

20న ఐటీడీఏ ముట్టడిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వాల్మీకి బోయ, ఖాయితీ లంబాడతో పాటు మరో 11, కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ కేసీఆర్ చేసిన ప్రకటనను కండిస్తూ ఈ నెల20న చేపట్టే ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ కోరారు. శనివారం ఖండాల, పోతాగుడా గ్రామాలలో పర్యటించి గ్రామ పాటెల్స్, ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 9 తెగల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయకపోగ, పైగా మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిది ఏండ్లు గడిచినప్పటికి ఆదివాసులకు సరైన విద్యా, వైద్య, ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లేక ఆనేక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఒకవైపు అసలైన గిరిజన తెగలకు దక్కాల్సిన హక్కులను లంబాడీలు దోచుకుంటుంటే వారిని ఎస్టీ జాబితలోంచి తీసివేయకుండా కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటుందని అన్నారు. సభ తీర్మానాన్ని వెనక్కి తీసుకోని రద్దు చేయని లేనియెడల ఇకపై గిరిజన గూడల్లో ఇంటిటికి తిరిగి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వనికి ఓటుతో సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆదివాసులు సాగుచేస్తున అటవీ భూములకు ఎటువంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20,తరికు సోమవారం రోజున ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముట్టడికి అన్ని వర్గాల ప్రజలు తొమ్మిది తెగల ఆదివాసీ ప్రజలు ఆదివాసీ ఉద్యోగులు ప్రజాస్వామిక వాదులు మేధావులు కార్మిక కర్షక వర్గాల ప్రజలు, పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయ వంతం చేయాలని కోరుతున్నా మన్నారు. కార్యక్రమంలో కుంమ్రము శ్యాంరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెట్టి మనోజ్, జిల్లా ప్రచార కార్యదర్శి ఆత్రం గణపతి, మరప రోహిదాస్ మెస్రం దినేష్, బి.రాహుల్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
ఆదివారం 19 ఫిబ్రవరి 2023

ఏరియా స్టోర్‌లో కొండచిలువ కలకలం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి స్టోర్‌లో శనివారం కొండచిలువ కలకలం రేపింది. దీనితో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. విధుల్లో భాగంగా వర్క్ షాప్ ఉద్యోగులు స్క్రాప్ వద్దకు వెళ్లగా అక్కడ కొండచిలువ కనిపించడంతో అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఫ్రెండ్స్ అండ్ స్నేక్ సొసైటీ వారిని పిలిపించి పామును పట్టుకున్నారు. పాము 9 అడుగుల పొడవు ఉంటుందని దానిని జాగ్రత్తగా పట్టుకొని అడవిలో వదిలేసినట్లు డీజీఎం(స్టోర్) సోమశేఖర్ తెలిపారు.

20న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-జన్నారం

తలసేమియా బాధితులను ఆదుకునేందుకై ఈనెల 20వ తేదీన జడ్పీఎస్ఎస్(బాయ్స్) ప్రభుత్వ పాఠశాల పొన్కల్ ఆవరణలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ చిట్యాల కిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ రక్తదాన శిబిరాన్ని 20వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారన్నరు. కార్యక్రమములో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ కూడా పాల్గొంటారన్నరు. ఈ రక్తదాన శిబిరానికి అన్ని స్వచ్ఛంధ, యువజన సేవా సంఘాల వారు, ప్రజలు 10 గంటలలోపు పాఠశాలకు వచ్చి, రక్తధానం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుచున్నామన్నరు.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో రెండవ విడత బర్డ్‌వాక్



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో రెండవ విడత బర్డ్‌వాక్, కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం ఆదివారం రెండు రోజులు నిర్వహించడం జరుగుతుందని జన్నారం ఎఫ్‌డీఓ మాధవరావు తెలిపారు. ఈ బర్డ్ వాక్ కార్యక్రమంలో 75 మంది పక్షి ప్రేమికుల పేర్లు నమోదు చేసుకొని పక్షులను తిలకిస్తున్నట్లు తెలిపారు. జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని గోండుగుడా, ఇంధన్‌పెల్లి అటవీ రేంజ్ పరిధిలోని గనిశెట్టి కుంట కామన్ పల్లి అటవీ ప్రాంతాల్లో, పక్షి ప్రేమికుల కోసం ప్రత్యేకంగా గుడారాలు ఏర్పాటు చేసి భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పక్షి ప్రేమికులు శనివారం సాయంత్రం గనిశెట్టి కుంట, కామన్ పెల్లి, గోండు గూడ, అడవి ప్రాంతాల్లో పక్షులను తమ కెమెరాతో ఫోటోలు తీసి రాత్రి అక్కడే గుడారాలలో బస చేయనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు ఆదివారం ఉదయం నుంచే పక్షులను తిలకించి మధ్యాహ్నం రెండు గంటల వరకు, జన్నారం అటవీ రేంజ్ కార్యాలయానికి చేరుకొని, భోజన అనంతరం, కార్యక్రమం ముగుస్తుందని ఎఫ్‌డీఓ మాధవరావు తెలిపారు.

వేలాల జాతరకు మహా పాదయాత్ర

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణానికి చెందిన చంద్రగిరి రమేష్ కన్న మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వేలాల జాతరకు కాలినడకన పయనమయ్యారు. సుమారు 60 కిలోమీటర్ల వరకు పాదయాత్ర సాగనుంది. రాత్రికి, రేపు తెల్లవారుజామున వరకు వేలాల జాతరకు చేరుకొని శివ దర్శనం చేకుంటామని తెలిపారు. పట్టణ వాసులు సుఖ సంతోషాలతో ఆయుఆరోగ్యాలతో ఉండాలని కోరుకోనున్నట్టు తెలిపారు.

తొలిమెట్టులో భాగంగా పాఠశాల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం

తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొన్కల్, బాదంపల్లి, జన్నారం, 5 రేండ్లగూడ ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర బృంధం జి.హనుమాండ్లు, చారి, జనార్ధన్, విద్యాసాగర్, సంతోష్,లు ఆయా పాఠశాలల్లోని తొలిమెట్టు, ప్రత్యేక తరగతుల నిర్వాహణను, అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థుల స్లిప్ టెస్టులను, 10వ తరగతి విద్యార్థులు పరీక్షకు సంసిద్ధమవుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రగతి సాధించిన తీరును, 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి, ప్రాథమిక విద్యను పటిష్ఠపరిచే విధానాలను సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

41వ జాతీయస్థాయి బాల, బాలికల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు శనివారం మూడవ రోజు కొనసాగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ జనరల్ మేనేజర్, ఎస్ఆర్‌పీ 3,3ఏ గని మేనేజర్ సంతోష్ కుమార్, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న బాలబాలికలు మంచి ప్రతిభ కనబరుస్తూ క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. పట్టుదలతో విజయం సాధించి జాతీయస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-చింతలమానపల్లి

మండలంలోని గూడెం గ్రామానికి చెందిన నింబర్ల బక్కుబాయి(50) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గూడెం గ్రామం నుండి తల్లి గారింటికి దింద గమానికి వెళ్లడానికి గురువారం ఉదయం బయలుదేరి సాయంత్రం వరకు దిందా గ్రామానికి చేరుకోకపోగా, కుటుంబ సభ్యులుకు రెండు రోజుల నుండి ఆచూకీ వెతకగా శనివారం రోజున చిత్తం గ్రామ సమీపాన చెట్టుకు ఉరివేసుకుని మతి చెంది ఉన్నట్లు తెలిపారు. ఆమె మానసిక ఆరోగ్య పరిస్తితి బాగలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు తమ్ముడు డోకే మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

శ్రీకృష్ణ గొర్రెల, మేకల పెంపకం దారుల సహకార సంఘం తపాల్‌పూర్ గ్రామ కమిటీని శనివారం గ్రామ పశువైద్యశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వి.రవికిషోర్, ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా పన్నాల గోపాల్, ఉప అధ్యక్షులుగా పన్నాల విజయ్, ప్రధాన కార్యదర్శిగా గొట్లమల్లేష్, కార్యదర్శిగా జెల్ల భీమయ్య, కోశాధికారిగా శ్రీజెల్ల రాజయ్య, డైరెక్టర్లుగా ఎర్రవేని లక్ష్మి, సల్ల లలితలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కిరణ్ కుమార్, గ్రామంలోని గొర్రెల మేకల పెంపకదారులు పాల్గొన్నారు. వీరి పదవి కాలం ఐదు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



వాంకిడిలో..

నవతెలంగాణ-వాంకిడి

మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో నిర్వహించే జాతరకు ఉదయం నుండే భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె ప్రవీణ్ తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివకేశవ ఆలయానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఆలయం శిథిలావస్థలో ఉండడంతో ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ శివాలయం ఎంతో పురాతనమైనదని, నమ్మిన భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా మహాశివుడు కొలువై ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. ఆమెతో పాటు ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ గాదె ప్రవీన్, బీఆర్ఎస్ నాయకులు, కమిటీ సభ్యులు ఉన్నారు.



ఆసిఫాబాద్‌లో..

కౌటాల : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శనివారం ఉపవాస దీక్ష పాటించి , మండలంలోని తాటిపల్లి వీర్దండి, వీరవెల్లి గ్రామాల సరిహద్దున గల గంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడి నుండి తాటి పెల్లి కుర్త వద్ద శ్రీశివ సిద్ధి హనుమాన్ ఆలయంలో దర్శనం కోసం భక్తులు క్యూ లైన్ లో గంటల తరబడి వేచి ఉన్నారు. మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయములో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కంకాలమ్మ ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సులువ కనకయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. తుమ్మిహెట్టి వద్ద కార్తీక్ మహారాజ్, హన్మాన్ మందిర్ ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలను ఆలయాల కమిటీ అధ్యక్షులు ఎల్ములె దత్తు, సుల్వ కనకయ్య, అంబేద శంకరయ్య, బొల్లంపెల్లి ప్రకాష్‌గౌడ్‌లు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

తాండూర్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మాసాడి శ్రీదేవి శ్రీరాములు ఆధ్వర్యంలో శివ మల్లన్న కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ జాతర ఉత్సవంలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలుఅధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా తాండూర్ సీఐ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మున్నూరు కాపు సంఘం, సోనీ జ్యువెలర్స్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య సతీ సమేతంగా జాతర ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల్లో స్వామివారిని దర్శించుకోవడానికి బెల్లంపల్లి ఎంపీపీ గోమాస శ్రీనివాస్ గారు, కన్నాల సర్పంచ్ స్వరూప-వెంకటస్వామి, మున్సిపల్ చైర్మన్ శ్వేత-శ్రీధర్, వైస్ చైర్మన్ సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్, పట్టణ యువజన అధ్యక్షుడు సన్నీబాబు, అభినవ సంతోష్ పాల్గొన్నారు.

దండెపల్లి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని మండలంలోని ద్వారక, గూడెం పుష్కర ఘాట్ స్నాన గట్టాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరించారు. గూడెం గోదావరి వద్ద సరిహద్దు జిల్లాలోని భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరించి గూడెం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో గోదావరి నది తీరం జనసంద్రంగా మారింది. ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో గోదావరి నది వద్ద బందోబస్తు నిర్వహించారు. నీరు ఎక్కువగా ఉండడంతో నది తీరంలో లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

రామకృష్ణాపూర్ : మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని కోదండ రామాలయం ప్రాంగణంలో ఉన్న శివాలయం, అంగడి బజార్ ఏరియాలోని నూతన రాజరాజేశ్వర ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం లింగోద్భవ కాలంలో బిల్వార్చన, రుద్రాభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలను వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా నిర్వహించారు. రాత్రి సమయంలో శివపార్వతిల కళ్యాణాన్ని ఆలయ అర్చకులు అంబా ప్రసాద్, దేవోజు రాజశేఖర నంద స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి భజన కార్యమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయం ప్రచార కార్యదర్శి దండు సదానందం, ఆలయ అర్చకులు చక్రవర్తి శర్మ, సూరజ్, కమిటీ సభ్యులు చిలుముల కొమరయ్య, కొట్టె నరేష్, రాజరాజేశ్వర స్వామి నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య కమిటీ సభ్యులు నందిపేట సదానందం, సుంకరి రాజేశం, రాంపెల్లి రమణ, రావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచిర్యాల : జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున సమీప గోదావరిలో పుణ్య స్థానాలు ఆచరించారు. నదీతీరంలో పూజలు చేసిన భక్తులు శైవ క్షేత్రాలు సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉపవాస దీక్షలతో జాగరణలో ఉండే భక్తులకు పర్వదిన సందర్భంగా అధికార పార్టీతోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్యవైశ్య సంఘం, మార్వాడి సేవ సమితి మరికొన్ని స్వచ్చంద సంస్థలు అల్పాహారం అందజేశారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, కౌన్సిలర్లు నాయకులు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ముల్కల్ల గోదారి తీరంలో పుణ్య స్థానాలు నిషేధించడంతో భక్తులు వ్యయాప్రయాసాలకు గురై దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. మంచిర్యాల తోపాటు పాత మంచిర్యాల గోదావరి తీరం అపశుభ్రంగా ఉండడం వల్ల భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. గోదావరి తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



కౌటాలలో..

కాగజ్‌నగర్‌రూరల్ : మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి జాతర ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఆలయ ప్రాంగణం భక్తజనసంద్రంగా మారి శివనామస్మరణతో మారుమోగింది. ఉదయం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజామున్నే ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. 9 గంటల నుంచి భక్తుల తాకిడి ప్రారంభమై మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. సిర్పూర్ న్యాయమూర్తి రవికుమార్, జేసీ రాజేశం, తహశీల్దార్ ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకులు పాల్వాయి హరీష్ బాబు, కొత్తపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ తదితర ప్రముఖులు దైవదర్శనం చేసుకున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ పంపిణీ, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, మిషన్ భగీరథ అధ్వర్యంలో తాగునీరు, చింతగూడ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం, అన్నపూర్ణ హోటల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ, కోయవాగు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, ఎస్సైలు జగదీష్, సోనియా, దీకొండ రమేష్, పోలీసులు ఎప్పటికప్పుడు జాతర పరిసరాల్లో బందోబస్తు నిర్వహించారు.

కాసిపేట : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పుణ్య స్నానాల కోసం మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మంచిర్యాల గోదావరికి తరలివెళ్లారు. బుగ్గ శివాలయం, వేలాల, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి శివాలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని భద్రకాళీ దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎంపీపీ జాజిమొగ్గ సుజాత శ్రీనివాస్, జడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న దంపతులు పట్టువస్త్రాలు అర్పించారు. భద్రకాళీ ఆలయం వద్ద మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శివప్రసాద్ తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆసిఫాబాద్ : శివనామస్మరణతో శనివారం జిల్లాలోని పలు శివాలయాలు మారుమోగాయి. జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో, పెద్దవాగు ఒడ్డున గల బాలేశ్వర ఆలయం, శివ కేశవ మందిరంతో పాటు మండలంలోని బూరుగుడ, దాంపూర్, గుండి ఆలయాలలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సందీప్‌నగర్‌లో నిర్వహించే శివ కళ్యాణంకు సంబంధించి ఉత్సవ విగ్రహాలను ప్రధాన రహదారి గుండా ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ ఊరేగింపులో మహారాష్ట్ర నుండి వచ్చిన బ్యాండ్ వారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయాల్లో జరిగిన శివకళ్యాణలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పలుచోట్ల ప్రముఖుల దర్శనం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మండలంలోని చిర్రకుంట దగ్గరలో గల దాంపూర్ లో గల ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో, బురుగుడా శివాలయంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిర్రకుంట గ్రామంలో ఎంపీపీ మల్లికార్జున్ కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహమద్, మేర సంగం యూత్ కార్తీక్, అడ్వకేట్ రాపర్తి రవి, చిలువేరి వెంకన్న, గుండ వెంకన్న, గంధం శ్రీనివాస్, సందీప్ నగర్ శివాలయం ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రాపర్తి సతీష్, విజయ్, నారాయణ, సతీష్, సాయి, అశోక్, మల్లేష్, దయాసాగర్, శ్రావణ్, ప్రశాంత్, నరసింహ, మధునయ్య, మహిళలు పాల్గొన్నారు.

గోదావరిలో పుణ్యస్నానాలు

జన్నారం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలైన కలమడుగు, ధర్మారం బాదంపల్లి, చింతగూడ, రోటిగూడ, తపాలాపూర్, తిమ్మాపూర్, రాంపూర్, గోదావరి పరివాహక ప్రాంతమంతా శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు ఉదయాన్నే లేచి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ఉన్న శివాలయంలో, రాంపూర్ గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి, మండల కేంద్రంలో ఉన్న సాయిబాబా, రామాలయం అయ్యప్ప స్వామి, దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ

వేమనపల్లి : మహాశివరాత్రి సందర్భంగా వేమనపల్లి ప్రాణహిత నది ఒడ్డున పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు కీర్తి శేషులు రుద్రభట్ల నారాయణ రావు జ్ఞాపకార్థం వారి కుమారులు వేమనపల్లి జడ్పీటీసీ, నీల్వాయి ఎంపీటీసీ స్వర్ణలత సంతోష్ కుమార్ అల్పాహారం, మజ్జిగ చల్లని నీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గాలి మధు, ఆవులమారి దుర్గక్క, కుశం పద్మ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు కోటారి మహేందర్, రాజేందర్, సురేష్, రామ్ రెడ్డి, ఈర్ల అరుణ, నాయకులు పూర్ణచందర్ రెడ్డి, బాపురెడ్డి, వినోద్ రెడ్డి, చెన్నూరి చెందు, ఏడ్ల మధునయ్య, అబ్దుల్ ఖాన్, శ్రీరాముల రమేష్, డోబ్బల రవి, పోశం, దూలం బాపు పాల్గొన్నారు.



దండేపల్లిలో..



మంచిర్యాలలో..



రామకృష్ణాపూర్‌లో..



వేమనపల్లిలో..

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని ఎస్ అండ్ సీపీ, సింగరేణి కార్మికులు, ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలను పరిష్కరించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌కు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కార్మికులకు 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ చిట్టీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లోని కార్మికులు రిటైర్మెంట్, మెడికల్ అన్‌ఫిట్ అవుతున్నందున వారి స్థానాల్లో కార్మికులను నియమించి పని భారం తగ్గించాలని కోరారు. ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డ్స్ సింగరేణిలో సంఖ్య తక్కువగా ఉన్నందున ఉద్యోగులను పెంచాలని, చాలా కాలంగా పనిచేస్తున్న జనరల్ మజ్దూర్‌లను పర్మినెంట్ చేయాలని కోరారు. అదేవిధంగా జనరల్ మజ్దూర్‌లను ప్రొడక్షన్ ఉన్నచోట ఔట్, ఇన్ పోస్టులకు ప్రత్యేకంగా గార్డులను నియమించాలని, దూరపు పోస్టులకు వెళ్లే సిబ్బందికి వాహన సౌకర్యం కల్పించాలని అన్నారు. సిబ్బంది తక్కువగా ఉన్నందున షిఫ్టు చేజింగ్, రెస్ట్‌చేంజ్ చేసుకోవడానికి వీలుగా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. అంతేకాకుండా గోలేటి మాదారం టౌన్‌షిప్‌లలో మిషన్ భగీరథ నీటి సరఫరాను కాలనీవాసులకు తెలిసే విధంగా సరఫరా చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెల 7వ తేదీ నుండి 10వ తేదీలోపు వేతనాలు చెల్లించే విధంగా ఆదేశించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను వెంటనే తెలియజేయాలని, అంతేకాకుండా కాంట్రాక్టర్ మారిన పనిచేస్తున్న కార్మికులను మార్చరాదని కోరారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, నాయకులు కృష్ణమోహన్, ఓదెలు, ఇట్యాల పోచం, శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక విభాగం నాయకులు చల్లూరి అశోక్, సాగర్ పాల్గొన్నారు.

మిర్చి వ్యాన్‌లో మంటలు

నవతెలంగాణ-తాండూరు



బెల్లంపల్లి కన్నాల ఫ్లైఓవర్ హనుమాన్ విగ్రహం వద్ద మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనంలో అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. స్థానికులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాల ఫ్లైఓవర్ చెక్ పోస్ట్ వద్ద వాహనం నిలిపి, డ్రైవర్ భోజనం చేసి వచ్చి లారీలో పడుకోగా అకస్మాత్తుగా వ్యాన్ నుండి మంటలు రావడంతో స్థానికులు డ్రైవర్‌ని అప్రమత్తం చేశారు. అప్పటికే వాహనం నుండి మంటలు రావడంతో వెంటనే స్థానికులు ఫైర్ ఇంజన్, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని నందిగామ నుంచి నాగపూర్ మార్కెట్ యార్డ్‌కు మిర్చి తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. హై టెన్షన్ వైర్లకు సమీపంలో వాహనాన్ని నిలిపివేయడంతో ఆ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం సంభవించింది. 20 మిర్చి బస్తాలు కాలిపోగా ఫైర్ సిబ్బంది పోలీసులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు ఛత్రపతి శివాజీ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో ఆరె సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆరె సంఘం నాయకులు గణేష్, పెంటు శనివారం తెలిపారు. ఈ జయంతికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.